

అధ్యక్షుడిగా ధర్మపురి సంజయ్

- నేడు మున్నూరు కాపు సంఘం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం
- హాజరుకానున్న పీసీసీ చీఫ్, ఎమ్మెల్యేలు, జిల్లా ప్రతినిధులు



నిజామాబాద్‌సిటీ, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం నిజామాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా మాజీ మేయర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ధర్మపురి సంజయ్ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వసలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి, మహ్మద్‌అలీషబ్బీర్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజారెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డితోపాటు ఇతరప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు.

నేడు జిల్లాలో పీసీసీ చీఫ్ పర్యటన
8



డీసీసీ డిక్లేర్డ్

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాటెపల్లి నగేష్‌రెడ్డి

నగర అధ్యక్షుడిగా బొబ్బిలి రామకృష్ణ

- ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి
- పదవుల కోసం తీవ్రంగా కొనసాగిన పోటీ
- సీనియార్టీ, విధేయతకు లభించిన గౌరవం
- ఆరేళ్ల పాటు సేవలందించిన మానాల

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడి నియామకానికి తెరపడింది. సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాటెపల్లి నగేష్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ప్రకటించారు. ఎన్నో రోజులుగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం కోసం పార్టీ శ్రేణులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న సందర్భంగా ఏఐసీసీ రాష్ట్రవ్యాప్తంగా 30 మంది డీసీసీ అధ్యక్షులను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవితో సరిసమానమైన హోదా కలిగిన నిజామాబాద్ నగర కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా యువజన కాంగ్రెస్ విభాగం మాజీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణను నియమించింది.

నిజామాబాద్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా మానాల మోహన్‌రెడ్డి ఆరేళ్ల పది నెలలు పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు రాష్ట్ర సహకార కో-ఆపరేటివ్ చైర్మన్‌గా నియమించింది. ఆయన సైతం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని నియమించాలని అధిష్టానాన్ని కోరడంతో నూతన అధ్యక్షుడి నియామకం అనివార్యమైంది. దాంతో ఈ పదవికి చాలామంది పోటీపడ్డారు. వీరిలో సీనియర్ నాయకులు, బీసీ, ఓసీ, మైనార్టీ నాయకులు సైతం బరిలో నిలిచారు. తీవ్ర ఉత్కంఠ కలిగించిన డీసీసీ అధ్యక్ష పదవికి చివరికి సీనియర్ నాయకుడు నగేష్‌రెడ్డికి దక్కింది. నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సైతం చాలా మంది పోటీపడినా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అనుచరుడైన బొబ్బిలి రామకృష్ణకు (మిగతా 8లో..)

విధేయతకు దక్కిన అవకాశం

ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన, నగరానికి చెందిన బొబ్బిలి రామకృష్ణకు సిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి వరించింది. ఎన్ఎస్‌యూఐలో 2004 నుంచి 2009 వరకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా పలు హోదాల్లో పనిచేశారు. యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు.



చీరలను పంపిణీ చేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఇందిరమ్మ చీరలతో
మహిళలకు ఆత్మగౌరవం

- ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి
- అట్టహాసంగా ఇందిరమ్మ చీరల పంపిణీ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

సుభాష్‌నగర్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మగౌరవం ఇనుమడింపజేసేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఈ వేడుకలో భాగస్వాములు కాగా ముఖ్యఅతిథిగా సుదర్శన్‌రెడ్డి హాజరై చీరలను పంపిణీ చేశారు. ఆకర్షణీయంగా, నాణ్యతతో కూడిన చీరలను పంపిణీ చేయడంపై మహిళలు, మహిళా సమాఖ్య ప్రతినిధులు హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా పి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో (మిగతా 8లో..)

ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారం

- ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలి
- టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

సుభాష్‌నగర్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేసుకుంటున్నామని టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీవోస్ సమావేశ భవన పునఃనిర్మాణ ప్రారంభోత్సవానికి శనివారం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకమత్యంగా ఉన్నపుడే సమస్యలన్నీ పరిష్కరించుకుంటామని తెలిపారు. ఉద్యోగుల సహాయ సహకారాలతో ఒక్కొక్క సమస్యను పరిష్కారం చేసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం రూ.700 కోట్ల (మిగతా 8లో..)



సమావేశంలో మాట్లాడుతున్న సీడ్స్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ప్రతీ డీలర్
తెలంగాణ సీడ్స్ అమ్మాలి

- రైతులకోసం ఏర్పడిందే విత్తనాభివృద్ధి సంస్థ
- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

నిజామాబాద్‌సిటీ, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసే విత్తనాలను జిల్లాలోని ప్రతీ డీలర్ రైతులకు విక్రయించాలని, ప్రైవేట్ కంపెనీల ఆకర్షణీయమైన ప్రకటనలు, మోసపూరిత మాటలతో ప్రైవేట్ విత్తనాలు అమ్మొద్దని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సూచించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రయివేట్ విత్తన డీలర్లతో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం అన్నిరకాలుగా రైతులను ఆదుకుంటోందని, పంటలను కొనుగోలు చేస్తోందని, అన్నారు. సన్నరకాలకు రూ.500 బోనస్ కూడా ఇస్తోందని (మిగతా 8లో..)



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

మంత్రి ఉత్తమ్‌తో
పోచారం భేటీ

వర్ని, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి శనివారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో హైదరాబాద్‌లోని జలసౌధలో భేటీ అయ్యారు. సిద్దాపూర్ రిజర్వాయర్, జాకోర, చందూర్ లిఫ్ట్‌ఇరిగేషన్ పనులపై చర్చించారు. పనులపై మంత్రికి వివరించారు.

ఆయిల్‌పామ్ సాగుకు
ప్రభుత్వ సబ్సిడీ

- ఉద్యానశాఖ అధికారి రాజు

వివరాలు 6లో..

డీసీఈబీ నియామకం
వివాదాస్పదం



- డీఈవో వైఖరిపై ఉపాధ్యాయ సంఘాల గుర్రు
- ఏకపక్ష నిర్ణయం అంటూ ఫిర్యాదులు

విద్యాశాఖలో కీలకమైన పరీక్షల విభాగం (డీసీఈబీ) కార్యదర్శిగా మూడో పర్యాయం డిచ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీజీ హెచ్ఎం సీతయ్యను నియమించడం వివాదాస్పదంగా మారింది. గత రెండు పర్యాయాలుగా ఆరేళ్లుగా పనిచేస్తున్న సీతయ్యకు మళ్లీ మూడోసారి అవకాశం కల్పిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఉత్తర్వులు జారీచేయడంపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నిజామాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా విద్యాశాఖలో పరీక్షల విభాగం అత్యంత కీలకమైనది. ప్రభుత్వ పాఠశాలలకు ఈ విభాగం నుంచే పరీక్ష ప్రశ్నపత్రాలు వెళ్తాయి. ఎలాంటి వివాదాలు లేని, ఉపాధ్యాయ సంఘాలతో సంబంధంలేని వ్యక్తులకు డీసీఈబీ కార్యదర్శిగా నియమించాల్సి ఉంటుంది. అయితే నిత్యం రాజకీయ నేతలతో తిరుగుతూ వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న సీతయ్యను డీసీఈబీ కార్యదర్శిగా నియమించడంపై ఉపాధ్యాయ సంఘాలు గుర్రుగా ఉన్నాయి. పలుమార్లు ప్రశ్నపత్రాల లీకేజీలు, ప్రశ్నపత్రాల మాయం, తదితర ఆరోపణలు ఉన్న వ్యక్తిని తిరిగి నియమించడంపై ఉపాధ్యాయ సంఘాలు ఉన్నత (మిగతా 8లో..)



కాంగ్రెస్ ప్రభుత్వంతోనే
అభివృద్ధి, సంక్షేమం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌రూరల్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, రైతులను రాజు చేసింది కాంగ్రెస్సేనని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్, ధర్మారం, నడిపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య (మిగతా 8లో..)

టీజీ ఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా
పీవీ రాజేశ్వర్‌రావు

వివరాలు 8లో..

- నిజామాబాద్ ఎస్ఈ రవీందర్ కామారెడ్డికి బదిలీ





క్రైం సమాచారం



పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న మద్దికుంట వాసులు

ఏపీ పోలీసులపై గ్రామస్థుల దాడి

» ఓ కేసు విషయంలో మద్దికుంటకు వచ్చిన భీమవరం పోలీసులు

రామారెడ్డి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా మద్దికుంట గ్రామానికి వచ్చిన ఏపీ పోలీసులపై గ్రామస్థులు దాడి చేసిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన బేబీ అనే మహిళతో కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామవాసి గడ్డపురం రమేష్‌కు పరిచయం ఏర్పడింది. గత కొన్నిరోజులుగా వీరిద్దరు సన్నిహితంగా ఉండడమే కాకుండా ఆమె వద్ద రమేష్ పెద్దమొత్తంలోనే డబ్బులు తీసుకుని మద్దికుంటకు వచ్చాడు. సదరు మహిళ రమేష్‌కు పలుమార్లు సంప్రదించినా స్పందన లేకపోవడంతో భీమవరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. భీమవరం పోలీసులు రమేష్‌పై కేసు నమోదుచేశారు. అక్కడి పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకునేందుకు శుక్రవారం అర్ధరాత్రి రామారెడ్డి మండలానికి వచ్చి స్థానిక పోలీసులను సంప్రదించారు. భీమవరం పోలీసులు మద్దికుంట గ్రామానికి అర్ధరాత్రి వెళ్లి అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. నిందితుడు, అతడి బంధువులు కొందరు గ్రామస్థులతో కలిసి పోలీసులపై దాడిచేశారు. భీమవరం పోలీసులు పరుగులు తీసి వారి వాహనంలో రామారెడ్డి పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. నిందితుణ్ని అదుపులోకి తీసుకునే క్రమంలో దాడిచేశారంటూ రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక స్థానిక పోలీసులు మద్దికుంటకు చేరుకుని రమేష్‌తో పాటు దాడిచేసిన వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే గ్రామంలోని మరికొందరు పోలీసుస్టేషన్‌కు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. గ్రామస్థులకు పోలీసులు నచ్చజెప్పగా ఆందోళన విరమించారు. భీమవరం పోలీసులపై దాడిచేసిన 10 మందిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుడు రమేష్‌ను భీమవరం పోలీసులు అదుపులోకి తీసుకుని ఏపీకి తీసుకెళ్లారు.

కటకటాల్లోకి కిలేడీ

» పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన మహిళ



కిలేడీ దగ్గర లభ్యమైన ఆభరణాలు

నిజామాబాద్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని కుమార్‌గల్లి ప్రాంతంలో బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తూ పై అంతస్తులో ఉన్న ఇంటి యజమాని ఇంట్లో దొంగ తనానికి పాల్పడ్డ మహిళను నిజామాబాద్ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు తెలియజేశారు. నగరానికి చెందిన గంగాకిషన్ ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్యూటిపార్లర్‌లో పనిచేస్తున్న గాయత్రి అనే మహిళ నిత్యం ఇంటికి వస్తూ మంచిగా మాట్లాడి వారితో స్నేహం పెంచుకుంది. డూప్లికేట్ తాళం చెవిని చేయించుకుని ఇంట్లో ఎవరులేని సమయంలో ఈనెల 13న ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు ను దొంగిలించింది. ఈ నెల 19న సేఫ్టీ లాకర్‌లో బంగారు ఆభరణాల కోసం చూడగా అవి లేకపోవడంతో ఇంట్లో ఏర్పాటు చేసిన సై కెమెరాను పరిశీలిం చాడు. ఇదివరకే రూ.20లక్షలు దొంగతనంకాగా ఇంటి యజమాని ముందు జాగ్రత్తగా ఇంట్లో సై కెమెరా ఏర్పాటు చేశాడు. బ్యూటి పార్లర్‌లో పనిచే స్తున్న గాయత్రి అనే మహిళ దొంగతనం చేసినట్లు తెలియడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తుచేసి మహిళను పట్టుకుని ఆమె దగ్గర నుంచి 1,300ల గ్రాముల వెం డి, రూ.50వేల నగదు, 80గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసు కున్నారు. నిందితురాలు రాచకొండ హారిక అలియాస్ గాయత్రిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో ఎస్‌ఐ సుమలత, కానిస్టేబుల్ గంగారాం, శ్రీనివాస్, లక్ష్మణ్, గోపాల్, మహిళ కానిస్టేబుల్స్ పద్మ, స్వప్న, అర్చన చురుగ్గా వ్యవహరించినందుకు సీపీ సాయిచైతన్య వారిని అభినందించారు.

ధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తి దుర్మరణం

బిచ్కుంద, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్ గ్రామానికి చెందిన కీర్తిరాజ్ ఖద్గాప్ చౌరస్తా వద్ద వరి ధాన్యం కుప్పపై పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చౌరస్తా వద్ద శంకర్ అనే వ్యక్తి తన వరి ధాన్యం అరబెట్టగా కీర్తీరాజ్ బరంగ్‌ఎడ్గి నుంచి బిచ్కుంద వైపు తన బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కుప్పను ఢీకొని రోడ్డుమీద పడ్డాడు. దీంతో కీర్తిరాజ్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ధాన్యం ఆరబోసిన శంకర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవీపేట,నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అనంతగిరికి చెందిన గంగాధర్ ఆటోలో నవీపేట నుంచి మోకన్‌పల్లి వైపు వెళ్తుండగా మహంతంకు చెందిన నీరడి శంకర్ మోకన్‌పల్లి నుంచి బైక్‌పై నవీపేట వెళ్తున్నాడు. రెడ్డిఫారం సమీపంలో అంజుమాన్ ఫారం రోడ్డు నుండి వస్తున్న కారును చూసిన ఆటో డ్రైవర్ ఒక్కసారిగా ఆటోను కుడి వైపు తిప్పడంతో ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడగా గంగాధర్‌కు తీవ్ర గాయాలు కాగా.. బైక్‌పై ఉన్న శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గంగాధర్‌ను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు గాయాలు కాలేదు. ఈ విషయంపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ప్రమాదంపై విచారణ జరుపుతున్నామన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

మోస్రా: చందూర్ మండల కేంద్రంలో కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడింది. చందూర్ నుంచి ఘన్‌పూర్ వైపు వెళ్తున్న క్రమంలో నిజామాబాద్-బాన్సువాడ ప్రధాన రహదారిపై టిప్పర్ బ్రేకులు ఫెయిలై ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

అసభ్య ప్రవర్తన.. నిందితుడి అరెస్టు

నందిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై 2 ఎల్.రాము తెలిపారు. ఈ నెల 21న కల్లుబట్టి దగ్గర ఓ వ్యక్తి బాలికను పొదల్లోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇసుక లారీల పట్టివేత

ఆర్మూర్‌టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని పెర్కిట్ వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు లారీలను పట్టుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారయణ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీలను పట్టుకొని యజమానులపై కేసు నమోదు చేశామన్నారు.

యువకుడి అదృశ్యం

కోటగిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన బాలయ్య(24) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. బాలయ్య కోసం బంధువుల ఇళ్లల్లో, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించిన ఆచూకీ లభించలేదన్నారు. బాలయ్య తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.



పచ్చరంగులోకి మారిన నీరు

వందేళ్ల వైభవం 'మురుగున..'

ఒకప్పుడు వేల ఎకరాలకు సాగునీరు.. ఆర్మూర్‌తో పాటు పలు గ్రామాలకు తాగునీరు అందించిన చెరువు మురికికూపంగా మారింది. వందేళ్ల చరిత్ర ఉన్న మల్లారెడ్డి చెరువు నేడు మురుగుతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. స్వచ్ఛమైన నీటిని అందించే జలవనరు కాస్తా.. కలుషితం కావడంతో సమీప నివాసాల పాలిట శాపంగా మారింది. చెత్త వేయడం, మురుగంతా చెరువులో చేరడంతో అపరిశుభ్రత నెలకొని ప్రజలు అవస్థలు పడుతున్నారు. - ఆర్మూర్ టౌన్

» కలుషితమవుతున్న మల్లారెడ్డి చెరువు » దశాబ్దాల పాటు తాగు, సాగు నీరందించిన జలవనరు » నేడు మురికికూపంగా మార్పు

ఆర్మూర్ నడిబొడ్డున ఉన్న మల్లారెడ్డి చెరువు చుట్టూ ఉన్న హుస్నాబాద్ కాలనీ, రాంనగర్, జిరాయత్‌నగర్, అరుంధతినగర్, ఔటిగల్లిల నుంచి కొందరు ఇంట్లోని చెత్తను చెరువు వద్ద పడేస్తున్నారు. కొందరు చనిపోయిన జంతువులను సైతం చెరువు ఒడ్డున పడేస్తున్నారు. ప్రతిసారి నిజాంసాగర్ కెనాల్ నీరు వచ్చేటప్పుడు తూము ద్వారా చెరువులోకి నీటిని నింపుతారు.

మల్లెల చెరువుగా ప్రశస్తి..

పట్టణ విస్తీర్ణం పెరగకముందు మల్లారెడ్డి చెరువు కింద పంటలు పండించేవారు. ఒకప్పుడు మల్లెల చెరువుగా పిలిచేవారని.. క్రమేపి మల్లారెడ్డిగా పేరు మారిందని పెద్దలు చెబుతున్నారు. ఇంట్లోకి తాగడానికి నీటిని తీసుకెళ్లేవారమని, వందేళ్ల చరిత్ర ఉందని పేర్కొన్నారు. చెరువు కారణంగా ఆ ప్రాంతంలో భూగరజలాలు తగ్గకుండా బోరుబావులు ఎండిపోలేదని చెప్పారు. పట్టణ జనాభా పెరగడంతో పెద్దబజార్, కింది బజార్‌లోని



చెరువులోకి చేరుతున్న మురుగునీరు

కొంతభాగం, హుస్నాబాద్‌కాలనీ, రాంనగర్, జిరాయత్ నగర్‌ల నుండి డ్రైనేజీ నీరు చెరువులోకి చేరడంతో మొత్తం కలుషితమైంది. గతేడాది మాజీ మునిసిపల్ చైర్మన్ వన్నెల్‌దేవి లావణ్య, కమిషనర్ రాజు కలిసి ఢిల్లీలోని పిస్తులిపెరా సోలారిస్ ప్రైవెట్ లిమిటెడ్ వారితో నీటి నాణ్యత మెరుగుదల, నీటిశుద్ధికి ప్రయత్నించారు. సంస్థ ముందుకొచ్చి ప్రక్రియ చేపట్టినా మళ్లీ అదే స్థితికి చేరుకుంది.

మురుగు కలవకుండా చర్యలు చేపట్టాలి

మల్లారెడ్డి చెఱువులో ఉన్న నీటిని శుద్ధిచేసి ప్రజల అవసరాలను అధికారులు గుర్తించాలి. ఎవరు రోగాల బారిన పడకుండా డ్రైనేజి నీరు చెఱువులో కలవకుండా తగు చర్యలు చేపట్టాలి.
- అంగుర్ నరేష్, స్థానికుడు

అమృత్ పథకంలో పనులు చేపడతాం



మల్లారెడ్డి చెరువులో డ్రైనేజీ నీరు చేరకుండా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమృత్ 2.0 పథకంలో పనులను చేపడుతాం.నీటిని సైతం శుద్ధిచేస్తాం. చెరువుకు పునరుజ్జీవం వచ్చేలా చేస్తాం. -రాజు,మునిసిపల్ కమిషనర్, ఆర్మూర్



వేల్పూర్‌లో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్‌కుమార్

కాంగ్రెస్‌తోనే పేదల కలల సాకారం

» బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

వేల్పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గుండేటి భాగ్య ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నియోజక వర్గంలోని అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. పేదల అభివృద్ధికి కాంగ్రెస్ పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న అధికారులు

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

వేల్పూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీలను ఇస్తుందని ఉద్యానశాఖ అధికారి రాజు అన్నారు. అంక్సాపూర్‌లోని పాసం రాజేందర్‌రెడ్డి తోటలో మొదటి గెలల కోతను శనివారం ఆయన పరిశీలించారు. గెలల కొనుగోలు కేంద్రం మండలంలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పంటను ఒకసారి నాటితే నాలుగేళ్ల తర్వాత నిరంతర ఆదాయాన్ని 30 సంవత్సరాల పాటు ఇస్తుందన్నారు. మొక్కలకు 90 శాతం రాయితీ కింద రైతు కేవలం ఒక ఎకరానికి రూ.వేయి చొప్పున జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి నిజామాబాద్ పేరిట డీడీ చెల్లిస్తే 50 మొక్కలు ప్రీయూనిక్ సంస్థ ద్వారా అందిస్తామ న్నారు. ఆయిల్ పామ్ మధ్యలో వివిధ రకాల అంతర్ పంటలు సాగు చేసేందుకు ఎకరానికి రూ.4,200 చొప్పున రైతు ఖాతాలో ఏడాదికోసారి జమచేస్తున్నట్లు చెప్పారు. 5ఎకరాలలోపు రైతులకు 90శాతం, ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ అందుతుదన్నారు. కార్యక్రమంలో ఏవో రాజు, ఏఈవో ప్రశాంత్, ప్రీయూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయికిరణ్, జోనల్ మేనేజర్ రోహిత్, క్లస్టర్ ప్రతినిధి రాకేష్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

రైతులు బయట విత్తనాలు కొనొద్దు

» రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు యాసంగిలో ప్రైవేట్ విత్తనాలు వాడకుండా.. విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలను రైతులు వాడాలని సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శనివారం మంథనిలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు బోనస్, రైతు భరోసా అందజేసి అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ప్రైవేట్ విత్తన కంపెనీల వారు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని సూచించారు. రైతులు అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ సంస్థల విత్తనాలు కొనుగోలు చేయవద్దని అన్వేష్‌రెడ్డి కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలను సరైన సమయానికి అందజేసే బాధ్యతను తాము తీసుకుంటామని అన్వేష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏవో హరికృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రామ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుట్టింటి శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

» బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను గ్రామాలలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని భవానీపేట్, ఊట్‌పల్లి, కల్దుర్కి, రాంపూర్ తదితర గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. పోలింగ్ జరిగే పోలింగ్ స్టేషన్‌లను సందర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలు పోలీసులకు, ఇతర అధికారులకు తప్పకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

కోటగిరి: రాబోయే స్థానిక ఎన్నికలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లూర్, కొత్తపల్లి, బస్వాపూర్, అడ్కాస్‌పల్లి గ్రామాలలో శనివారం ఓటర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికలలో డబ్బు, మద్యం పంచితే సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయా గ్రామాలలో ఓటర్లు, వార్డులు, పోలింగ్ బూత్‌ల సమాచారాన్ని సేకరించారు. ఆయన వెంట రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ మండలంలో ప్రజలతో సమావేశమైన ఏసీపీ శ్రీనివాస్

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

భీమ్‌గల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చొక్కయ్య గుట్టపై శనివారం శ్రీ లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ప్రారంభమైన ఉత్సవాలలో భాగంగా రెండో రోజు గుట్టపై ఉదయం విశ్వ క్లేననిధి, అభిషేకం, అఖిలాండకోటి బ్రహ్మాండ స్వరూపులైన శ్రీ లక్ష్మీవెంకటేశ్వర కల్యాణఘట్టాలను పురోహితులు వైభవంగా జరించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు పక్క గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా పల్లకీసేవ

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండలో శనివారం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు కొండపైకి చేరుకొని, స్వామివారి పల్లకీని కొండ చుట్టూ ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, బ్రాహ్మన్‌పల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పల్లకీకి పూజలు చేస్తున్న భక్తులు

నేడు విగ్రహ పునఃప్రతిష్ఠ

భీమ్‌గల్ రూరల్: బడా భీమ్‌గల్‌లో పెద్దంగంటి ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి ఎల్లమ్మ తల్లి దీవెనలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని బడాభీమ్‌గల్ గ్రామ కమిటీ, పెద్దంగంటి ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



నూతన విగ్రహం

గల్ఫ్ గోస సభను విజయవంతం చేయాలి

ఆర్మూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న గల్ఫ్ గోస సభను విజయవంతం చేయాలని ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహంనాయుడు కోరారు. శనివారం ఆర్మూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు, సమగ్ర ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలుకు నిజామాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున గల్ఫ్ కార్మికులు సభకు తరలిరావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక పాలసీ ప్రకటించి గల్ఫ్‌లో మృతిచెందిన వారికి అందజేసే రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని ఈసీఆర్ దేశాలైన 18 దేశాలకు వర్తింపజేయాలని కోరారు. గల్ఫ్‌కార్మికుల సమస్యల సాధనకు గల్ఫ్ కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీయూసీఐ నాయకులు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

» టీయూసీఐ నిజామాబాద్, కామారెడ్డి అధ్యక్షుడు ముత్తెన్న

ఆర్మూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని టీయూసీఐ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా అధ్యక్షుడు ఎం.ముత్తెన్న, కోశాధికారి అర్వింద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లుగా మార్చి పెట్టుబడి దారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మికులు పలుమార్లు పోరాటాలు చేసినప్పటికి ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదించాలని చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీడీ వర్కర్స్ యూనియన్ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు నజీర్, శ్రీనివాస్, పద్మ, సునీత, లక్ష్మీ, నిఖిల్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నిజామాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు పట్టుకున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కాలూరు రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లారీని తనిఖీచేయగా అందులో రేషన్ పంపిణీకి సిద్ధంగా ఉంచిన 29 టన్నుల బియ్యం లభించాయి. నిర్మల్ జిల్లాకు చెందిన మాజిద్ నిజామాబాద్‌కు బియ్యం తరలించినట్లు వివరించారు. లారీని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పోలీసులు శుక్రవారం రాత్రి 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో తుల శ్రీధర్ తెలిఆరు. బాన్సువాడ నుంచి దెగ్లూర్ వైపు బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని బుడ్మి చౌరస్తా వద్ద ఎస్సై రాములు సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నారు.

టీఎల్ఎం ప్రదర్శన

నవీపేట: అబ్బాపూర్(ఎం) అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పూర్వ బాల్యదశ సంరక్షణ, విద్య దినం(ఈసీసీఈ డే)నిర్వహించారు. ప్రతి నెల 4వ శనివారం ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన టీఎల్ఎం మెటీరియల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవోలు సంతోష్, వెంకటేశ్వర్ రావు, పీహెచ్ఎన్ గోదావరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ కమిటీ ఎన్నిక

నవీపేట: మండలంలోని అనంతగిరిలో శనివారం ఏఐకేఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఇంటింటా రైతు సంఘం, ఊరూరా రైతు సంఘం కార్యక్రమంలో భాగంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్బన్న, ఉపాధ్యక్షుడిగా మారుతి, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, సహాయకార్యదర్శిగా పోశెట్టి, కోశాధికారిగా శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్, ఒడ్డెన్న పాల్గొన్నారు.

సుంకినిలో సోయాపంట తరలింపు

కోటగిరి: పోతంగల్ మండలంలోని సుంకినిలో తూకం వేసిన సోయాపంటను శనివారం అధికారులు లారీల్లో లోడింగ్ చేసి తరలించారు. కొనుగోలు చేసిన సోయాను తరలించాలని రైతులు నిరసన తెలపగా.. అధికారులు స్పందించారు. గ్రామంలో తూకం వేసిన సోయాను తరలించేందుకు లారీలను ఏర్పాటు చేశారు. మూడు లారీల్లో సోయా బస్తాలను లోడింగ్ చేసి తరలించారు. అధికారులు స్పందించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా నరేష్

బోధన్,నవంబరు22(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ బోధన్ మండల అధ్యక్షుడిగా నాగన్‌పల్లికి చెందిన కొండపల్లి నరేష్‌ను నియమించినట్లు నియోజకవర్గ అధ్యక్షుడు దాడి రమేష్, అసెంబ్లీ ఇన్‌చార్జి నీరడి రవి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

భీమ్‌గల్: పట్టణ కేంద్రానికి చెందిన రవి కుటుంబానికి యోగా కమిటీ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రవి మృతిచెందగా.. అంత్యక్రియల కోసం యోగా కమిటీ సభ్యులు ఆర్థికసాయం అందించడంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. అలాగే యోగ బృందం సభ్యుడు ప్రవీణ్ 25 కిలోల బియ్యం అందజేసి ఉదారత చాటుకున్నాడు. కార్యక్రమంలో అనంతరావు,భూపాల్, హన్మండ్లు, దేవేందర్, లింబాద్రి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

కోటగిరి: పోతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సుమారు 50రకాల వంటకాలను తయారు చేసి తీసుకువచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తయారు చేసిన వంటకాలను రుచి చూసి అభినందించారు. హర్యానా వంటకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ వంటకాలు చేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదవ్, ఉపాధ్యాయులు నాగనాథ్, రామారావు, చందర్, సుజాత, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శనివారం లబ్ధిదారులతో పాటు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద కుటుంబాలకు తమ సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేరుస్తోందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి నవనీత, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, గంగాధర్, నర్సారెడ్డి, లింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రామన్నపేట్‌లో పలువురు లబ్ధిదారులకు ఇంటి మంజూరుపత్రాలను అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్ : మండలంలోని రామన్నపేట్‌లో పలువురు లబ్ధిదారుకకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు శనివారం అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా డబ్బులు మంజూరుకు కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పండ్లు, నోట్‌బుక్స్‌ల పంపిణీ

మోర్తాడ్: నిజామాబాద్ తొలి మేయర్ ధర్మపురి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గోపి పండ్లు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో విజయ్, గౌతమ్, సుభాష్, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆలూర్: మండలంలోని మిర్ధాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.గగన రాష్ట్రస్థాయి అండర్ -17 ఖోఖో పోటీలకు ఎంపికైంది. ఇటీవల జిల్లాకేంద్రంలోని నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లుగా పీఈటీ ఎం.సుజాత తెలిపారు. ఈనెల 23-25 వరకు భువనగిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. గగనను ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టణ ప్రజలు పన్నులు చెల్లించాలి

బోధన్: మునిసిపాలిటీ పరిధిలో ఇంటి యాజమానులు, వ్యాపార సముదాయాలలో అధికారులు పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శనివారం పట్టణంలోని పలు వార్డులలో కమిషనర్ జాదవ్ కృష్ణ బిల్ కలెక్టర్లతో కలిసి పన్నుల బకాయిల వసూళ్లలలో పాల్గొన్నారు. పట్టణంలో పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను బకాయి పడిన వారితో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ నేరుగా మాట్లాడుతున్నారు. సదరు యాజమానులతో మాట్లాడి పన్ను వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్నులతో పట్టణంలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

ఇందిరా మహిళా శక్తి చీరల తరలింపు



గోదాం నుంచి వివిధ మండలాలకు తరలిస్తున్న చీరలు

నాగిరెడ్డిపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో భద్రపరిచిన ప్రభుత్వం అందిస్తున్న ఇందిరా మహిళా శక్తి చీరలను శనివారం వివిధ మండలాలకు తరలించినట్లు స్థానిక ఐకేపీ ఏపీఎం రాంనారాయణ గౌడ్ తెలిపారు. ఈ గోదాంకు 30,294 చీరలు వచ్చాయన్నారు. అందులో 30,104 చీరలను వివిధ మండలాలకు తరలించామన్నారు. నిజాంసాగర్ మండలానికి 7560, పిట్లం- 3840, ఎల్లారెడ్డి- 5400, బాన్సువాడ- 2760, లింగంపేట- 3000, నాగిరెడ్డిపేట- 7544 చొప్పున చీరలను పంపించామన్నారు. గోదాంలో ఇంకా 190 చీరలు ఉన్నాయన్నారు. ఆయా మండలాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు వీటిని పంపిణీ చేస్తామన్నారు.

మట్టి దారిలో.. పుట్టెడు కష్టాలు

- 3 కి.మీ. రహదారికి రూ.1.80 లక్షల మంజూరు
- గ్రావెల్ వేసింది ఒక కిలోమీటర్ దూరమే



నర్సింగ్‌రావుపల్లి- జక్కాపూర్ మట్టిరోడ్డు ఇదే..

నిజాంసాగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా నుంచి జక్కాపూర్ గ్రామం వరకు 3 కి.మీ మేర రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ప్రయాణానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. 25 ఏళ్ల కిందట ఫార్మేషన్ రోడ్డు వేయగా, అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో నేటికీ అది బీటీరోడ్డుగా రూపుదాల్చలేదు. దీంతో అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారు లకు ఇక్కట్లు తప్పట్లేదు.

రూ.1.80 లక్షల నిధులు మంజూరైనా..

ఈ రహదారికి గ్రావెల్ పేరిట రూ.1.80 లక్షల ఎన్‌డీఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. కాగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్ కి.మీ. దూరం అక్కడక్కడ తూతూమంత్రంగా గ్రావెల్ చల్లి చేతులు దులుపుకొన్నారు. ఈ రహదారిని బీటీ రోడ్డు నిర్మాణం చేయాలన్న కనీస ఆలోచన లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2000లో ఫార్మేషన్ రోడ్డు

నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా నుంచి జక్కాపూర్ వరకు 3 కి.మీ మేర 2000ల సంవత్సరంలో మల్లూరు, జక్కాపూర్ గ్రామాల ప్రజలను సమష్టిగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే అధికారపార్టీ నాయకులే ఈ రహదారి గ్రావెల్ పనులు చేజిక్కుంచుకుని అధికారులతో ఒక్కటై ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. అయినా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 2006 సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద ఈ ఫార్మేషన్ రోడ్డును మెటల్ రోడ్డుగా మార్చేందుకు అప్పటి పాలకులు నిధులు మంజూరు చేసినా, ఈ రోడ్డు అటవీ ప్రాంతం మధ్యలో ఉన్నందున ఆ శాఖ అధికారులు పనులను అడ్డుకోవడంతో మెటల్ రోడ్డు నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికైనా ఈ సమస్యకు పరిష్కారం చూపి రహదారి బాగు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. మట్టిరోడ్డే దిక్కు



నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా నుంచి జక్కాపూర్ వరకు ఫార్మేషన్ రోడ్డుపై అంతంత మాత్రంగానే మట్టి వేశారు. ఏళ్లు గడుస్తున్నా బీటీరోడ్డుగా మార్చట్లేదు. ఇరుకు రోడ్డులో ఇక్కట్లు పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్డువిస్తరించి, మెటల్‌రోడ్డుగా మార్చాలి.

- సాతెల్లి అంజయ్య, జక్కాపూర్

25 ఏళ్లుగా కష్టాలు



అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఈ రోడ్డుపై మట్టి పనులు చేపట్టారు. పూర్తిస్థాయిలో కాకుండా అక్కడక్కడే మట్టివేసి చేతులు దులుపుకొన్నారు. 25 ఏళ్లుగా అనేక కష్టాలు పడుతున్నాం.

-నీరడి హనుమండ్లు, జక్కాపూర్

మద్నూర్‌లో నో బ్యాగ్ డే



మద్నూర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు

మద్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకెళ్లి అవగాహన కల్పించారు. నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి అధికారి కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులు ప్రభుత్వ శాఖల పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కలుగుతుందని పాఠశాల ఉపాధ్యాయులు రచ్చ శివకాంత్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ పరిపాలన, భూ రికార్డులు, సర్టిఫికెట్ల జారీ, సర్కారు భూముల సంరక్షణ, ఎన్నికల నిర్వహణ వంటి కార్యక్రమాలను వివరించారు. ఎంపీడీవో రాణి గ్రామీణ అభివృద్ధి పథకాలు, మౌలిక వసతుల పనులు, మహిళా స్వయం సహాయక సంఘాలకు మద్దతు, విద్య, ఆరోగ్య కార్యక్రమాల అమలు వంటి వాటిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల విద్యా వనరుల కేంద్రంలో సిబ్బంది ఉపాధ్యాయ శిక్షణ, విద్యా నాణ్యత పర్యవేక్షణ, విద్యా వనరుల పంపిణీ, వివిధ విద్యా కార్యక్రమాల అమలు విధానాలను విద్యార్థులకు తెలియజేశారు. నో బ్యాగ్ డే కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల పనితీరును ప్రత్యక్షంగా చూడటం ద్వారా భవిష్యత్తులో వారిలో బాధ్యతాగుణం, సామాజిక అవగాహన పెరిగే అవకాశం ఉందని, ప్రభుత్వ విభాగాల సేవలను విద్యార్థులు అర్థం చేసుకోవడంలో ఈ సందర్శన ఉపయోగకరంగా నిలుస్తుందని పాఠశాల ఉపాధ్యాయులు రచ్చ శివకాంత్ తెలిపారు.

పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్



పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థినులు

నసురుల్లాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నసురుల్లాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చందర్ మాట్లాడుతూ.. మాక్‌పోలింగ్ ప్రధాన ఉద్దేశం విద్యార్థులకు ఎన్నికలపై ప్రత్యక్ష అనుభవంతో కూడిన అవగాహన కల్పించడమే లక్ష్యమని అన్నారు. కాగా ఎన్నికల నోటిఫికేషన్ మొదలు నామినేషన్ల దాఖలు, ఉపసంహరణలు, ఫలితాలు ఇలా అన్నింటినీ దశల వారీగా నిర్వహించి చివరికి ప్రమాణస్వీకారాణ కార్యక్రమాలు సైతం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు హనుమాండ్లు, ఉపాధ్యాయులు పండరి గౌడ్, కిషన్ లాల్, ఇందిరా, శ్రీనివాస్, లక్ష్మణ్, గోపాల్, సవిత, తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పిట్లం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్ కాంగ్రెస్ నాయకులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ప్రజా ప్రతినిధుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో రైతులకు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కాగా బోనస్ నగదు రైతుల ఖాతాల్లో జమకావడంతో సీఎం, జుక్కల్ ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశామన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు హనుమాండ్లు, విండో చైర్మన్లు శపథం రెడ్డి, నాగిరెడ్డి, విండో వైస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, నాయకులు రవి, నజీర్, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



లబ్ధిదారులకు ఇందిరా మహిళా శక్తి చీరలు అందజేస్తున్న నాయకులు

పిట్లం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి చీరలను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో మహిళలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మండల కాంగ్రెస్ నాయకులు కలిసి మహిళలకు చీరలు అందజేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ మనోజ్ కుమార్, వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, విండో చైర్మన్లు శపథం రెడ్డి, నాగిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్య క్షుడు హన్మాండ్లు, సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, ఇమ్రోజ్, అశోక్, శివ, మోయిన్, బాలరాజు, ఎంపీడీవో రఘు, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ శ్రీహరిరాజు

ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

బాన్సువాడటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాన్సువడ మునిసిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో శనివారం మునిసిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు ముందుకు వచ్చి త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని, బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నసురుల్లాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలంలోని నెమలి గ్రామానికి చెందిన వీరయ్య మూడురోజుల క్రితం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ శనివారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే నసురుల్లాబాద్ ఎక్స్ రోడ్‌కు చెందిన లక్ష్మణ్ రావు సైతం ఇటీవల మరణించగా అతని కుటుంబీకులకు రూ.5వేలు, మండల కేంద్రానికి చెందిన పూసల సురేష్ ఆరోగ్యం బాగాలేక మరణించగా అతని కుటుంబీకులకు రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కామారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ సాయిలు, శ్రీనివాస్, నారాయణ, అనిల్ సేట్, యాదగిరి గౌడ్, కంది పెద్దమల్లేష్, సాయిలు, రాంరెడ్డి, నాగరాజ్ గౌడ్, కొప్పుల సాయిలు, శేఖర్, బల్వీర్‌సింగ్, కిష్టయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలు మానుకోండి



కార్మికులతో మాట్లాడుతున్న ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్

సిరికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కవ్వింపు చర్యలు మానుకొని సమస్యల పరి ష్కారంపై దృష్టిసారించాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నిజామాబాద్ రూరల్- కామారెడ్డి సంయుక్త జిల్లాల ప్రధాన కార్యదర్శి ఆర్.రమేష్ దేశాయి బీడీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో జరిగిన బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీడీ కమీషన్ (టేకేదారులు) ఏజెంట్లను పావులుగా వాడుకుని కార్మికులపై బెదిరింపులకు పూనుకోవడం చట్ట వ్యతిరేకమని అన్నారు. ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కంపెనీ యాజమాన్యం దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతుంటే కొంతమంది టేకేదారులను తమ ఏజెంట్లుగా మార్చుకుని కార్మికులను బెదిరింపులకు పాల్పడడం ఏమాత్రం భావ్యం కాదన్నారు. కంపెనీకి అనుకూలంగా తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలని కార్మికులపై టేకేదారులతో ఒత్తిడి పెడుతున్నారని ఆరోపించారు. సంతకాలు చేయని కార్మికులను తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను బెదిరింపులు చేయడం మానుకుని నాణ్యమైన ఆకు, తంబాకు, దారం వెయ్యి బీడీలకు సరిపడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు అనీస్, లావణ్య, మణెమ్మ, లత, రాగవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



డిపోమేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సభ్యులు

సిరికొండకు బస్సు వేయండి

సిరికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ డిపో నుంచి సిరికొండకు బస్సును ప్రారంభించాలని కోరుతూ ఆర్మూర్ డిపోమేనేజర్ రవికుమార్‌ను కలిసి సిరికొండ వీడీసీ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. భీమ్‌గల్ మీదుగా సిరికొండకు ఆర్మూర్ నుంచి బస్సును నడిపించడం వల్ల మండల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేయడంతో ఆయన సానుకూలంగా స్పందించారని వీడీసీ చైర్మన్ మాదస్వామి చెప్పారు. డీఎంను కలిసిన వారిలో వీడీసీ సభ్యులు మోహన్, లింబాద్రి, లక్ష్మణ్, రాజలింగం, తదితరులు ఉన్నారు.

దేశరక్షణకు యువత ముందుకురావాలి

- బీజేపీ బాన్సువాడ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ



పాఠశాలలో మాట్లాడుతున్న బీజేపీ ఇంచార్జి యెండల లక్ష్మీనారాయణ

బాన్సువాడటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాట యోధులకు స్ఫూర్తినిచ్చిన గేయం వందేమాతరం అని, అదే స్ఫూర్తితో యువత సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ దేశ రక్షణకు ముందుకు రావాలని బీజేపీ పార్టీ బాన్సువాడ ఇంచార్జి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. వందేమాతర గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని న్యూటన్స్ పాఠశాలలో ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులతో కలిసి ఆయన వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వందేమాతరం స్ఫూర్తిగా ప్రతీ ఒక్కరు కదలాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చినరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, మజ్జిగ శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, చిరంజీవి, మహేశ్, గుడుగుట్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నాయకులు తదితరలున్నారు.

నేడు రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం

బీర్కూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీవో మహబూబ్ తెలిపారు. గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా మహిళల రిజర్వేషన్‌లను ఖరారు చేయుటకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి అన్ని పార్టీల అధ్యక్షులు సకాలంలో హాజరుకావాలన్నారు.

ఉచితంగా మధుమేహ పరీక్షలు



బీర్కూర్‌లో మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో శిబిరానికి తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. మధుమేహం ఉన్నట్లు రిపోర్టు వచ్చిన వారిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, సభ్యులు విఠల్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, దుంపల రాజు, బసవరాజు, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరుల నమోదుపై శిక్షణ

బాన్సువాడటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ వరప్రసాద్ సూక్ష్మ నీటి పారుదల, నీటి వనరుల గణన నమోదుపై గణనదారులకు శిక్షణ ఇచ్చారు. నీటి కుంటలు, చెరువులు, సూక్ష్మ నీటిపారుదల వనరులను లెక్కించనున్నట్లు ఆయన తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయాలని గణనదారులకు సూచించారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలు, అయ్యప్ప భక్తుల అయ్యప్ప నామస్మరణలతో పడిపూజ వైభవంగా సాగింది. నిజామాబాద్ నగరంలోని సాయికృపా నగర్‌లో గల అంతిరెడ్డి విజయ్‌పాల్‌రెడ్డి నేతృత్వంలో భక్తుల అయ్యప్ప నామస్మరణల నడుమ నిర్వహించారు. వేదపండితులు సుబ్బారావు, శశాంక్‌లు వేదమంత్రాలు పఠించగా పుణ్యవచనం, గణపతి, గౌరీ, కుమార స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప పూజలు జరిపారు. భక్తుల అయ్యప్ప నామస్మరణలతో అయ్యప్పకు పంచామృతాభిషేకాలు నిర్వహించి 18 మెట్ల పూజను చేశారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అంతిరెడ్డి హరిష్, సాగర్, రామ్‌రెడ్డి, విజయ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



పడిపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డిబార్

సుభాష్‌నగర్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్షల్లో శనివారం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు టీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. 3వ రోజు ఉదయం జరిగిన పరీక్షలకు 5225 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 5478 మంది హాజరయ్యారని తెలిపారు. 246 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 6042 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 5609 మంది విద్యార్థులు హాజరుకాగా, 430 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ఒకరు, మంజీరలో ఒకరు, మోర్తాడ్ ప్రభుత్వ కళాశాలలో ఇద్దరిని డిబార్ చేసినట్లు వివరించారు.

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రవి

సిరికొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): డీటీఎఫ్ సిరికొండ మండల శాఖ అధ్యక్షుడిగా కె.రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం సిరికొండ మండలకేంద్రంలో జరిగిన డీటీఎఫ్ ఉపాధ్యాయుల సమావేశంలో మండల కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా లింగయ్య, ఉపాధ్యక్షుడిగా సుధీర్, కార్యదర్శిగా నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. సిరికొండ మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు.

రైతుకు భరోసా ఏది..?

- ఇంకా అందని రైతుభరోసా
- పంట నష్టపరిహారం సైతం..
- అన్నదాతల ఎదురుచూపులు
- నగదు అందిస్తే కాస్త ఉపశమనం

మద్నూర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండల రైతులు యాసంగి పంట పెట్టుబడి కోసం రైతుభరోసా ఎప్పుడు వస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. అసలే ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో అధిక వర్షాలకు పంటలు దెబ్బతినడంతో సాగు కోసం చేసిన అప్పులను రైతులు తిరిగి చెల్లించలేకపోయారు. దీంతో కొత్తగా అప్పులు పుట్టని దుస్థితి ఏర్పడింది. మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో చేతిలో డబ్బులు లేక పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 24,725 మంది రైతులు ఉన్నారు.

పెట్టుబడి ఖర్చుల కోసం..

పెట్టుబడి ఖర్చులకోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా రైతులకు అండగా ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలుచేస్తుంది. కాగా ఎకరాకు రెండు పంటలకు కలిపి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. బడ్జెట్ సమస్య కారణంగా ఎకరాకు రూ.12 వేలకు తగ్గించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తొలుత ఎకరంలోపు, తర్వాత ఎకరం, రెండెకరాలు, మూడు, నాలుగు, ఐదు, ఆపైన పరిమితి లేకుండా అందరికీ రైతుభరోసా అందింది.

పంట నష్టం సైతం అందివ్వాలి

పెట్టుబడి సాయం అందడంతో రైతులు ఖరీఫ్‌లో అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఇంతవరకూ బాగానే ఉన్నప్పటికీ అధిక వర్షాల కారణంగా పత్తి, సోయా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. సుమారు 6000 ఎకరాల్లో పంటనష్టపోయినట్లు గుర్తించారు. కానీ నష్టపరిహారం ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్లో పెట్టుబడి సహాయం, నష్టపరిహారం అందితే పంటలు వేసుకుని ఆదుకుంటుందని రైతులు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

అప్పు చేసి మరీ సాగుచేశా

యాసంగికి సంబంధించిన రైతుభరోసా అక్టోబర్‌లో రావాల్సి ఉండగా ఇంతవరకు ఇవ్వలేదు. ఎకరం భూమి లో శనగ పంట సాగుచేశాను. పెట్టుబడి అందక అప్పుతీసుకొని మరీ సాగుచేశాను. ప్రభుత్వం వెంటనే రైతుభరోసా డబ్బులు అందిస్తే అప్పులు తీరుతాయి.

- అశోక్, రైతు, మద్నూర్



మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

వెంకన్న ఆలయంలో పూజలు

పిట్లం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో నూతనంగా నిర్మించిన వెంకన్న ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం భక్తులు ఉదయం నుంచే చేరుకొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండేకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందించారు. బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాంరెడ్డి, ప్రతాప్ రెడ్డి, నారాయణరెడ్డి, నర్సాగౌడ్, హనుమంతరావు, కిషన్ పాల్గొన్నారు.



బాధ్యతలు తీసుకున్న ఎస్ఈని సన్మానిస్తున్న అధికారులు

ఇన్‌చార్జ్ ఎస్ఈగా రాజేశ్వర్‌రావు

సుభాష్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పీవీ రాజేశ్వర్ రావును నియమిస్తూ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్మూర్ డీఈగా పనిచేస్తున్న రాజేశ్వర్ రావును నిజామాబాద్ సర్కిల్ ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించారు. ప్రస్తుతం ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను కామారెడ్డికి బదిలీ అయ్యారు. 4 ఏళ్ల 2 నెలలపాటు ఎస్ఈగా పనిచేసిన రవీందర్‌ను ఆకస్మికంగా బదిలీ చేశారు. శనివారం మధ్యాహ్నం ఇన్‌చార్జ్ ఎస్ఈగా రాజేశ్వర్‌రావు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఈని విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు కలిసి ఘనంగా సన్మానించారు.

డిచ్‌పల్లి డీఈగా హరిచంద్ నాయక్

సుభాష్‌నగర్: టీజీఎన్‌పీడీసీఎల్ డిచ్‌పల్లి డివిజన్ డీఈగా హరిచంద్‌నాయక్‌ను నియమిస్తూ సీఎండీ వరుణ్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కొన్ని రోజులుగా డిచ్‌పల్లి డీఈ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న కామేశ్వర్ స్థానంలో హరిచంద్‌నాయక్ బాధ్యతలు చేపట్టనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే
అభివృద్ధి, సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలను ప్రారంభించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళ్యాణలక్ష్మి చెక్కులను, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం దండగ అని, సన్నరకం వడ్లను వేయవద్దని రైతులను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసేవిధంగా సన్న రకానికి రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. రాంపూర్ గ్రామానికి ఇప్పటివరకు రూ. 12 కోట్ల నిధులు కేటాయించి పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలు లోనే మహిళలకు వడ్డీలేని రుణాలు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటివి అమలుచేశామన్నారు. మహిళా సంఘాలు సిండికేట్‌గా ఏర్పడి బస్సులనుకొని ఆర్టీసీకి అద్దెకి ఇస్తే, నెలనెల డబ్బులు వస్తాయని ఆయన అన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాయన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా, ఎంపిటిసిగా, జడ్పీటీసీగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ ఫామ్‌హౌస్‌కి పరిమితం అయిందని, కేటీఆర్‌ను త్వరలో జైలుకు పంపడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలసాని శ్రీనివాస్, అమృతపూర్ గంగాధర్, కంచెటి గంగాధర్, సామ్ సన్, వాసు బాబు, ఈగ నారాయణ రెడ్డి, సతీష్ రెడ్డి, భాస్కర్,సొసైటీ చైర్మన్లు డైరెక్టర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ డీలర్ తెలంగాణ సీడ్స్ అమ్మాలి

(5వ పేజీ తరువాయి)

అన్నారు. రైతుల నుంచి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలుచేస్తున్నది తెలిపారు. అన్ని రకాలుగా ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే రైతులు మాత్రం ప్రైవేట్ వ్యక్తులను ఆదరించడం సరికాదన్నారు. రైతులకు నష్టం జరగకుండా నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాల్సిన బాధ్యత ప్రయివేట్ డీలర్ల మీద వుందన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ రైతుల బాగుకోసం, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించడం కోసం ఏర్పాటు చేసిన సంస్థ అని, దీన్ని కాపాడాల్సిన బాధ్యత మీ అందరిమీద ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ డీలర్ 20 క్వింటాళ్ల విత్తనాలు అమ్మాలన్నారు. మా సంస్థకు మీరే బ్రాండ్ అంబాసిడర్లు ప్రయివేట్ విత్తన కంపెనీల కబంద హస్తాల నుండి రైతులను కాపాడాల్సిన బాధ్యత మీ పై మన అందరి పై వుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా డీలర్లు, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, భీమగల్ ఏడీఏ సాయికృష్ణ, టీజీఎస్‌డీసీ మార్కెటింగ్ మేనేజర్ రాజీవ్, ఆర్ఎం రఘు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో పీసీసీ చీఫ్ పర్యటన

నిజామాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వ ముఖ్యసలహాదారు పి.సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆదివారం జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు మహేష్‌కుమార్ గౌడ్ స్వగ్రామమైన భీంగల్ మండలం రహత్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 11.30గంటలకు జిల్లాకేంద్రంలోని ప్రగతినగర్‌లోని మున్నూరు కాపు సంఘంలో జిల్లా మున్నూరుకాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ధర్మపురి సంజయ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి సుదర్శన్‌రెడ్డితో కలిసి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 4గంటలకు నందిపేట్ మండలం ఐలాపూర్‌లో జరిగే కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డితో కలిసి పాల్గొననున్నారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

» సహకార సంఘాల ఇన్‌చార్జులతో కలెక్టర్

సుభాష్‌నగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బందికి గురికాకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి శనివారం సహకార సంఘాల ఇన్‌చార్జిలతో కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పలు చోట్ల నాట్లు వేయడంలో ఆలస్యమైనందున ధాన్యం దిగుబడులు కొంత ఆలస్యంగా వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అలాంటి ప్రాంతాలను మినహాయిస్తూ, మిగితా చోట్ల 2, 3 రోజులలో ధాన్యం సేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చొరవ చూపాలని అన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచాలని, వెంటదివెంట ధాన్యం తరలింపు కోసం లారీలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద దొడ్డు రకం ధాన్యం సైతం సకాలంలో అన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నామని, ఒకవేళ ఎక్కడైనా ధాన్యం దిగుమతి చేసుకోకపోతే తమ దృష్టికి తేవాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం అన్లోడ్ జరిగాక ట్రక్ షీట్లు వేగంగా తెప్పించుకుని ఓ.పీ.ఎం.ఎస్ ఎంట్రీలు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.సీ.ఓ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి

శ్రీచందనకు కలెక్టర్ అభినందన

గేట్ అర్హత పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన జి.శ్రీచందనను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. భీమ్‌గల్ మండలం జాగిర్యాల్‌కు చెందిన జి.దేవేందర్, స్రవంతి దంపతుల కుమార్తె అయిన శ్రీచందన గేట్ పరీక్షలో 81.67శాతం మార్కులతో 302 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా శనివారం ఆమెను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అభినందించారు. కోచింగ్ లేకుండా తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

చిన్నారులకు టీకాలు వేయాలి

సుభాష్‌నగర్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని చంద్రశేఖర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాలను పట్టణ ఆరోగ్య కేంద్రంలో జనని సెషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీకాల కార్యక్రమాన్ని సందర్శించి, వాక్సిన్‌ల నాణ్యతను, ఐస్ ప్యాక్‌లను పరిశీలించారు. రికార్డులు, హాజరుపట్టిక పరిశీలించి ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. అంకితభావంతో పనిచేసి ప్రతి చిన్నారికి టీకాలు వందశాతం పూర్తిచేయాలన్నారు. అర్హులై ఉండి టీకాలు తీసుకోని వారిని గుర్తించి టీకాలు ఇవ్వాలని కోరారు. మాతాశిశు ఆరోగ్య సేవలను అందరికి అందేలా చూస్తూ అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. పీహెచ్‌సీల లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్య అధికారి డాక్టర్ శిఖర, ఏఎన్ఎం సావిత్రి, ఆశావర్కర్‌లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

సుభాష్‌నగర్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్హతతో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సుకు మహిళల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాజశ్రీ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 40 సీట్లలో రెండేళ్ల కోర్సు ఉంటుందన్నారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, బోనాఫైడ్, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా దరఖాస్తులు స్వీకరించడం లేదని వివరించారు. నవంబరు 25 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కోచ్ నాగరాజును భినందిస్తున్న సీపీ సాయిచైతన్య

నాగరాజుకు సీపీ అభినందన

సుభాష్‌నగర్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అభివృద్ధి, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంలో కోచ్‌ల పాత్ర కీలకమని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లాకేంద్రంలోని కమిషనరేట్‌లో శనివారం అన్‌సంగ్ గురు అవార్డు అందుకున్న నాగరాజును సీపీ అభినందించారు. ఫుట్‌బాల్ అభివృద్ధికి మరింత సేవ చేయాలని కోరారు.

డీసీసీ డిక్లేర్డ్..

(5వ పేజీ తరువాయి)

సీసీసీ అధ్యక్ష పదవి దక్కింది.

సీనియర్ నేతకు దక్కిన డీసీసీ పదవి..

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎంతో మంది నేతలు పోటీపడినా, సీనియర్ నాయకుడైన రూరల్ నియోజకవర్గానికి చెందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటెపల్లి నగేష్‌రెడ్డికి పదవి వరించింది. దివంగత నేత ధర్మపురి శ్రీనివాస్ శిష్యుడిగా పేరుపొందిన నగేష్‌రెడ్డి నాలుగు సార్లు నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. డిచ్‌పల్లి మండలం ముల్లంగి గ్రామ సర్పంచ్‌గా రాజకీయ జీవితం ప్రారంభించారు. మోపాల్ పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేశారు. నిజామాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. టీపీసీసీ కార్యదర్శిగా, టీపీసీసీ ప్రదాన కార్యదర్శిగా సైతం పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించారు. సమీకరణల వల్ల పార్టీ టికెట్‌ను త్యాగం చేశారు. ఈ నేపథ్యంలో అదిష్టానం ఆయనకు జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెట్టింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని, తనపై నమ్మకంతో పదవిని ఇచ్చినందుకు నగేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

డీసీఈబీ నియామకం
వివాదాస్పదం

(5వ పేజీ తరువాయి)

అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాయి. సీనియర్ పీజీహెచ్‌ఎంలను డీసీఈబీ సెక్రెటరిగా నియమించాల్సి ఉండగా ప్రధాన ఉపాధ్యాయ సంఘం ఒత్తిడి మేరకు డీఈవో సీతయ్యను తిరిగి నియమించడంపై విమర్శలు వస్తున్నాయి.

విద్యాశాఖలో దుమారం..

అవినీతికి దూరంగా ఉంటానని చెబుతున్న విద్యాశాఖ అధికారి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని డీసీఈబీ సెక్రెటరిగా ఎలా నియమిస్తారని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. డీఈవో సమావేశంలో ముందుగానే సీతయ్య పేరును ప్రతిపాదించి మళ్లీ ఆయనకే అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించి బలవంతంగా డీసీఈబీ సర్వసభ్య సమావేశంలో హాజరైన సభ్యులచేత ఒప్పించడంపై విమర్శలు వస్తున్నాయి. హడావిడిగా ఉత్తర్వులు ఇవ్వడం వెనక ప్రధానోపాధ్యాయ సంఘం నేతల ఒత్తిడి ఉందనే విమర్శలు ఉన్నాయి. సీనియర్ పీజీహెచ్‌ఎంలు ఎంతో మంది ఉండగా ఒకరికే మూడుసార్లు అవకాశం ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

మోపాల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాల్‌కల్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించగా.. మధ్యలో ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను శనివారం హౌసింగ్ అధికారులు పరిశీలించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత భూమిపూజ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం స్లాబ్‌ల వరకు వేసి అర్థాంతరంగా నిలిపివేశారు. నిర్మాణంలో జాప్యం ఎందుకు జరిగిందని హౌసింగ్ అధికారులు ఆరా తీస్తున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రాజెక్ట్ డైరెక్టర్, హౌసింగ్ ఏఈ శివసాయి, గ్రామ సెక్రెటరీ మల్లేష్ పరిశీలించారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఇందిరమ్మ చీరలతో
మహిళలకు ఆత్మగౌరవం

(5వ పేజీ తరువాయి)

అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక, సామాజిక ప్రగతిని చాటాలని పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈసారి నాణ్యమైన చీరలను తయారు చేయించిందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం చీరలను అందించారని ఆక్షేపించారు. ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా, తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అరు లైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని జిల్లాలకు సరిపడా చీరలను పంపించిందని, అవసరమైన పక్షంలో జిల్లాకు మరిన్ని చీరలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని, అరు లైన ఏ ఒక్కరు మినహాయించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని, భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితవు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని, నిపుణులైన ఉపాధ్యాయులు, మెరుగుపడిన సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించాలని హితవు పలికారు. మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని, రసాయనిక మందులు వినియోగించకుండా సేంద్రీయ పద్ధతిలో పందిరి కూరగాయల సాగు వంటివి చేపట్టేందుకు ముందుకు వచ్చే మహిళా సంఘాలు, సమాఖ్యలకు ప్రభుత్వపరంగా మరింత ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1వ తేదీ నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. వడ్డీ లేని రుణాలను అందించడమే కాకుండా, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాయితీపై రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందిస్తోందన్నారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం ఇతోధికంగా తోడ్పాటును అందిస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో మహిళలు సమిష్టిగా ఉంటూ తమ వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని, తద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆచరణలో నిరూపితం చేయాలని పిలుపునిచారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న ఇందిరమ్మ చీరలు ఎంతో నాణ్యతతో కూడుకుని ఉన్నాయని అన్నారు. అరు లైన వారందరికీ చీరలు పంపిణీ జరిగేలా పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డిలు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

ఒక్కొక్కటిగా సమస్యల పరిష్కారం

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగు పెండింగ్ బిల్లులు పాస్ అవుతున్నాయన్నారు. మనమందరం ఐకమత్యంగా ఉండడం వల్లనే ప్రభుత్వం మన సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం శ్రమిస్తున్న జిల్లా అధ్యక్షుడు సుమన్‌ను అభినందించారు. అంతకముందు టీఎన్‌జీవోస్ సమావేశ మందిరంను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. సమావేశ మందిరానికి స్వర్గీయ స్వామినాథం సమావేశ మందిరం అని నామకరణం చేశారు. అనంతరం టీఎన్‌జీవోస్‌కు సుదీర్ఘంగా సేవలు అందించిన మాజీ అధ్యక్షుడు రాజారాం, నరసింహరావు, గైని గంగారాం, సలహాదారుగా సేవలు అందిస్తున్న వనమాల సుధాకర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సతీష్‌కుమార్, పెద్దోల్ల నాగరాజు, కోశాధికారి దినేష్‌బాబు, కార్యవర్గ సభ్యులు సునిత, మంజూల, శ్రీనివాస్, మాణిక్యం, నగర అధ్యక్ష కార్యదర్శులు జాకిర్ హుస్సేన్, మారుతి, శశికాంత్‌రెడ్డి, ప్రవీన్‌రాజ్, సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిసెంబరు 1 నుంచి పరీక్షలు

సుభాష్‌నగర్, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు డీ, ఈఎల్, ఈడీ మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష హాల్ టికెట్‌లను కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని అభ్యర్థులు తమ హాల్ టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

సినిమా గైడ్


దేవి	: రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: ప్రేమంటే (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: దేదే ప్యార్‌దే-2 (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: సీసు రోడ్ ఆఫ్ రివేంజ్(11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కల్కి వనం (10.45)
	: 12 ఏ రైల్వే కాలని (1.30, 7.30, 10.20)
	: పాంచ్ మినార్ (4.30)
స్క్రీన్-2	: రాజు వెడ్స్ రాంబాయి (11.00)
	: ప్రేమంటే (1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-3	: ది గర్ల్‌ఫ్రెండ్ (1.45, 7.30)
	: రాజు వెడ్స్ రాంబాయి (4.30, 10.20)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: 12 ఏ రైల్వే కాలని (10.55, 4.40, 10.20)
	: విక్డ్ ఫర్ గుడ్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.20)
స్క్రీన్-2	: 120 బహద్దూర్ (హిందీ) (11.00, 4.55, 10.50)
	: ప్రేమంటే (2.00, 7.55)
స్క్రీన్-3	: సిస్సు రోడ్ టూ రివేంజ్ (12.20, 5.20)
	: ఇట్లు మీ వెదవ (2.30), : పాంచ్ మినార్ (7.30)
	: ది గర్ల్‌ఫ్రెండ్ (10.20)
స్క్రీన్-4	: మస్తీ-4(హిందీ)(11.05,7.40), రాజు వెడ్స్ రాంబాయి (2.10)
	: కల్కి వనం (5.00),
	: దేదే ప్యార్‌దే-2 (హిందీ) (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,26,500	రూ.1,16,625	రూ.1640

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ. 290



ఎన్‌కౌంటర్ల పేరుతో
మనుషులను చంపుతున్న కేంద్రం

నిజామాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరుతో మనుషులను అమానుషంగా హత్యచేయడం ఆందోళనకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నక్సల్స్ ఏరివేత పేరుతో బూటకపు ఎన్కౌంటర్లను చేస్తూ మావోయిస్టులను, ఆదివాసీలను, గిరిజనులను పట్టుకొని చంపుతున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా హత్యలు చేస్తోందన్నారు. తప్పుచేసినవారిని కోర్టులో ప్రవేశపెట్టకుండా ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. 2026 మార్చి నెలాఖరువరకు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించి ఆపరేషన్ కగారు పేరుతో వందలాది మంది అమాయక ఆదివాసి గిరిజనులను ఎన్కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను మానుకొని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ది వెంకట్‌రాములు, నూర్జహాన్, శంకర్ గౌడ్, నిల్వాల నరసయ్య, మోహన్ పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్: మావోయిస్టు అగ్రనాయకుడు హిడ్మా తదితరుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమెక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. సీపీఐ (మావోయిస్టు) కార్యకర్తలు, నాయకులను ఎన్‌కౌంటర్ల పేరుతో ప్రభుత్వం హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండిసు తన్నామన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీ గిరిజనులను లేకుండా చేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేటర్లకు ధారాదత్తం చేసేకుట్రలో భాగంగానే ఆదివాసీలను నక్సలైట్లని ముద్రవేసి చంపివేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆపరేషన్ కగారు పేరుతో వందలాది మంది అమాయక ఆదివాసి గిరిజనులను ఎన్కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ కాల్పులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేల్పూరు భూమయ్య, పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబ, రమేష్, గంగాధర్,మల్లికార్జున్, సాయిరెడ్డి, శివకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ధర్నాచౌక్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు హరించేలా కేంద్రం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిచారు. శనివారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద నాలుగు లేబర్ కోడుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధానినరేంద్రమోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఐఎఫ్‌టీయూ నగర అధ్యక్షుడు మల్లికార్జున్, నగర ప్రధాన కార్యదర్శి రామ్‌శివకుమార్లు మాట్లాడారు. ఆరేళ్లగా ఈ నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ తమ నిరసనలు తెలిపాయన్నారు. అయినా కేంద్రం దొడ్డిదారిన నల్లచట్టాలు అమల్లోకి తీసుకురావడం కోసం ప్రకటించిందని మండిపడ్డారు. బీహార్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తిరుగులేదని భావించి ఈ విధంగా ప్రకటించారన్నారు. కానీ కార్మికవర్గం తమ హక్కుల సంరక్షణ కోసం నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకు పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు బి.భూమన్న, నీలం సాయిబాబా, మోహన్, నర్సింగ్‌రావు, రాజు, మల్లేష్, శంకర్, రియాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: పదేళ్లగా దేశంలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని ఏఐటీయూసీ కార్మికులు 106 సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు మరణ శాసనం విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశంలో 8 గంటల పని అమలవుతున్న సందర్భంలోనే ప్రైవేట్ రంగంలో 12 నుంచి 14 గంటలు పని చేయించుకుంటున్నారన్నారు. కార్మికులకు రక్షణ లేకుండా, పని భద్రత లేకుండా, పనికి గుర్తింపు లేకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు పని భద్రత కల్పిస్తూ యూనియన్ పెట్టుకునే హక్కును కల్పిస్తూ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించే పద్ధతిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.చక్రపాణి, హైమదీబేగం, హనుమాండ్లు, అనీల్, కవిత, స్వరూప, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ ఆధ్వర్యంలో..

కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌ల గెజిట్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ధర్నా నిర్వహించారు. నాలుగు లేబర్‌కోడ్‌ల దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం టీయూసీఐ నాయకులు ముస్కె సుధాకర్, నరేందర్ మాట్లాడారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొచ్చిన కార్మిక చట్టాల సవరణ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయరెడ్డి, మురళి, రవికిరణ్, విటల్, గణేష్, లక్ష్మీకాంత్, శాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.